సాక్షి కుమురం భీం

ఆదివారం । 1 । జనవరి । 2023

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ఆసిఫాబాద్అర్బన్: నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా నడుచుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్రూరల్: పశు సంవర్ధకశాఖ ఆధీనంలోని 1962 వాహనంలో ఖాళీగా ఉన్న వైద్యపోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఈఎంఆర్ఐ సంస్థ మేనేజర్ సామ్రాట్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. (Bachelor of veterinary science in animal Husbandry) కోర్సులో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 3, 4 తేదీల్లో ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో మంచిర్యాలలోని 102, 108 కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
31.5/15.8

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా, ప్రకాశవంతంగా ఉంటుంది. పగలు ఎండ ఎక్కువ అనిపిస్తుంది. ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డీజీపీని కలిసిన ఎస్పీ

ఆసిఫాబాద్అర్బన్: తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అంజనీకుమార్‌ను శనివారం జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని పోలీసు కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి డీజీపీ అంజనీకుమార్ జిల్లా ఎస్పీని అడిగి తెలుసుకున్నారు.

4న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్



మాట్లాడుతున్న డీటీడీవో మణెమ్మ

ఆసిఫాబాద్అర్బన్: గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ నెల 4న సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు గిరిజన సంక్షేమ ఉపసంచాలకురాలు మణెమ్మ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పీఎంఆర్సీ కార్యాలయంలో ఎగ్జిబిషన్ నిర్వహణ సన్నాహక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ఏటీడీవోల పర్యవేక్షణలో ఆసిఫాబాద్, జైనూర్, కాగజ్‌నగర్ కేంద్రాల్లో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని 46 ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఆరు అంశాలపై తాము రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. డివిజన్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అంశాల వారీగా ఇద్దరిని ఎంపిక చేసి జనవరి 10న ఉట్నూర్ కేంద్రంలో నిర్వహించనున్న ఐటీడీఏ లెవల్ ఉమ్మడి జిల్లాల సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఏసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓలు హుస్సేన్, పురుషోత్తం, జీసీడీవో శకుంతల, కమిటీ సభ్యులు శ్రీనివాస్, స్వర్ణలత, ప్రసాద్, ప్రీతి, మహేష్, సోనేరావ్, వామన్‌రావ్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



కుట్టుశిక్షణను ప్రారంభిస్తున్న స్వరూపారాణి

రెబ్బెన(ఆసిఫాబాద్): మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపారాణి అన్నారు. ఏరియాలోని సోనాపూర్‌లో శనివారం ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తి శిక్షణ కోర్సుల్లో ప్రావీణ్యం సాధించి స్వయం ఉపాధికి మార్గంగా మల్చుకోవాలని సూచించారు. స్వయం ఉపాధిలో రాణిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవాలన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు సింగరేణి సేవా సమితి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గోలేటి సర్పంచ్ పోటు సుమలత, సీనియర్ సేవా సభ్యులు కుందారపు శంకరమ్మ, ప్రసాదినీ, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో శనివారం ఉద్యోగ విరమణ పొందిన కార్మికులను గని అధికారులతో పాటు తోటి కార్మికులు ఘనంగా సన్మానించారు. దాదాపు 35 సంవత్సరాల పాటు సంస్థకు సుదీర్ఘ సేవలు అందించిన హెడ్ ఓవర్‌మెన్ సిరికొండ కనకయ్య దంపతులతో పాటు జనరల్ మజ్దూర్ అకనాకర్ ముకాజీ దంపతులను ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పీవో మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందుతున్న కార్మికులు శేష జీవితాన్ని సుఖశాంతులతో గడపాలని కోరారు. మేనేజర్ రాజేశ్వర్‌రావు, సేఫ్టీ అధికారి మధుసూదన్, ఇంజనీర్ మహేష్, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

నయా సాల్ జోష్ 2023



ఆసిఫాబాద్ జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. యువతీ యువకులు 2022కు బైబై తెలుపుతూ 2023 నూతన సంవత్సరానికి జోష్‌తో స్వాగతం పలికారు. అనుకున్న లక్ష్యాలు నెరవేరాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సర్వత్రా ఆశిస్తున్నారు. ఇందుకోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామంటున్నారు. గతేడాది సాగు నిరాశ మిగల్చగా.. ఈసారైనా తమ పంట పండాలని అన్నదాత ఆశపడుతున్నాడు. వరుణుడి కరుణతోపాటు గిట్టుబాటు దక్కాలని వేడుకుంటున్నాడు. నేరాలు–ఘోరాలకు అడ్డుకట్ట వేయాలని పోలీసు శాఖ భావిస్తుండగా.. 'ఆమె'పై అఘాయిత్యాలు ఆగాలని మహిళాలోకం కోరుకుంటోంది. ఈ నూతన సంవత్సరంలో అందరి ఆకాంక్షలు నెరవేరాలని ఆశిస్తూ.. హ్యాపీ న్యూ ఇయర్.

- ఉత్సాహంగా కొత్త సంవత్సరంలోకి..
- జిల్లా అభివృద్ధిపై అధికారుల దృష్టి..
- విద్య, వైద్యంలో పురోగమనంపై ఆకాంక్ష
- అందుబాటులో ఉంటామంటున్న ప్రజాప్రతినిధులు

అన్ని రంగాల్లో అభివృద్ధి



జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశాం. జైనూర్ మండలం మార్లవాయిని ఆదివాసీ గిరిజన కాటేజీగా ఏర్పాటు చేస్తాం. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల పనులు వేగవంతం చేశాం. ఈ యేడాది పనులు పూర్తయితే వైద్యులతోపాటు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సిబ్బంది రావడం జరుగుతుంది. కొత్త సంవత్సరంలో జిల్లా కేంద్రంలో కేంద్రియ విద్యాలయం ఏర్పాటుకానుంది. గతేడాది ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయస్థానం సాధించగా ఈ ఏడాది ప్రథమస్థానం సాధించేలా ముందుకెళ్తున్నాం. – రాహుల్ రాజ్, కలెక్టర్

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు



జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. 2022లో జిల్లా ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించారు. కొత్త సంవత్సరంలో ప్రజలు ఫ్రెండ్లీగా కలిసిమెలిసి ఉండాలి. కమ్యూనిటీ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తాం. నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. – కె.సురేశ్ కుమార్, ఎస్పీ

వైద్యసేవల మెరుగుకు కృషి



జిల్లాలో వైద్యసేవలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తా. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ఖాళీగా ఉన్న గైనకాలజిస్టు పోస్టును భర్తీ చేస్తాం. జిల్లా కేంద్రంలో మాతాశిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తాం. జిల్లా కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంతో పాటు మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచడమే లక్ష్యం. – కోవ లక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్

ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తాం



నూతన సంవత్సరంలో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కొత్త ఒరవడితో, ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తాం. నెలరోజుల్లో గిరిజన ప్రాంతాలకు కనెక్టివిటీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. తాగు, సాగునీరు, విద్య, వైద్యం, తదితర అభివృద్ధికి పాటుపడుతాం. టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిన నేపథ్యంలో పొరుగున ఉన్న మహారాష్ట్రలో బీఆర్ఎస్‌ను విస్తరింపజేస్తాం. కేంద్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి కృషి చేస్తాం. – ఆత్రం సక్కు, ఎమ్మెల్యే

గిరి.. 'చైతన్య'ం!

వారంతా ఆదివాసీ గిరిజనులు.. ఐకమత్యమే వారి బలం.. గ్రామస్తులంతా కలిసి వేలిముద్రలకు చెక్‌పెట్టాలని నిర్ణయించుకున్నారు. సంతకాలు పెట్టడం నేర్చుకున్నారు. వందశాతం అక్షరాస్యత సాధించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు మండలంలోని గిరి గ్రామమైన చౌపన్‌గూడ వాసులు. చైతన్య యువజనం సంఘం సభ్యులు అన్నీతామై గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.

- వందశాతం అక్షరాస్యత సాధించిన చౌపన్‌గూడ
- ఆ గిరిజనగ్రామంలో అందరూ అక్షరాస్యులే..
- ఐకమత్యంతో అన్ని కార్యక్రమాల్లో కలిసి ముందుకు
- చైతన్య యువజన సంఘం సహకారంతో కార్యక్రమాలు



చౌపన్‌గూడ గ్రామం

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీ గిరిజన గ్రామాల్లో సహజంగా నిరక్షరాస్యులే ఎక్కువగా ఉంటారు. కానీ మండలంలోని చౌపన్‌గూడలో అంతా అక్షరాస్యులే. తమ ఆచార వ్యవహారాలు, సంస్కృతిని కాపాడుకుంటూ ముందుకెళ్తున్నారు. సుర్దాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చౌపన్‌గూడలో 75 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆయా కుటుంబాల్లో 325 జనాభా ఉన్నారు. 235 మంది ఓటర్లు ఉండగా అందులో 110 మంది పురుషులు, 125 మంది మహిళలు ఉన్నారు. సుమారు 50 మందికి పైగా విద్యావంతులు ఉండగా 15 మంది ఉద్యోగులు వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, చేతిపంపు, మిషన్ భగీరథ ట్యాంకు ద్వారా తాగునీటి సరఫరా, పాఠశాల, అంగన్‌వాడీ భవనం ఉన్నాయి. ప్రతీరోజు గ్రామస్తులు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. 1989లో గ్రామానికి చెందిన ఆత్రం కుసుంరావు చైతన్య యువజన సంఘాన్ని స్థాపించగా నేటికీ కొనసాగుతోంది. రెండేళ్లకోసారి సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికైన సభ్యులు తాముచేసే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి అన్ని వనరులు కల్పించుకునేందుకు కృషి చేస్తారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ సంఘం సభ్యులు తమ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకునేందుకు కంకణబద్ధులయ్యారు. అనుకున్నదే తడవుగా గ్రామంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు. వేలిముద్రలు వేసే వారంతా నేడు సంతకాలు పెడుతున్నారు. సంఘం సభ్యులు చేసిన కృషితో నేడు ఆగ్రామం వందశాతం అక్షరాస్యత సాధించింది.

ఏటా నమూనా ఎన్నికలు

ఏ గ్రామంలో లేని విధంగా ప్రతీ సంవత్సరం జనవరి మాసంలో చౌపన్‌గూడలో నమూనా ఎన్నికలు నిర్వహిస్తారు. గ్రామానికి చెందిన కొందరిని పోటీలో నిలబెడతారు. ఎన్నికల ప్రాధాన్యత, ఓటింగ్ చేసే తీరుని ప్రజలకు వివరిస్తారు. ఓటింగ్‌లో అందరూ పాల్గొనేలా చూస్తారు. నెలనెలా సమావేశాలు నిర్వహించి గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తారు. ముఖ్యంగా డ్రాపౌట్ విద్యార్థులను బడిలో చేర్పించడం, విద్యావంతులైన నిరుద్యోగులకు ఉద్యోగసాధనకు శిక్షణ ఇప్పించడం లాంటి కార్యక్రమాలు చేస్తారు. శ్రమదానం నిర్వహించి చెత్తాచెదారం తొలగిస్తారు. గ్రామాని నీట్‌గా ఉంచేందుకు కృషి చేస్తున్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సంతకం చేస్తున్నా



నేను పాఠశాలకు వెళ్లలేదు. బడి అంటే అస్సలు తెలియదు. కానీ మా ఊళ్లో ఉన్న యువజన సంఘాల సభ్యులు మాలాంటి వారికి రాత్రిపూట బడి చెప్పారు. అక్షరాలు దిద్దించి సంతకం పెట్టడం నేర్పించారు. – ఆత్రం బార్‌దేవ్‌బాయి

ఐకమత్యమే మా బలం



మేమంతా ఐకమత్యంగా ఉంటాం. ఎవరికి ఏ ఆపద వచ్చినా అందరం కూర్చొని చర్చించుకుంటాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. అన్ని పండుగలు కలిసే చేసుకుంటాం. ఏ సమస్య వచ్చినా అందరం ఏకమవుతాం. – ఉయిక గంగు

అన్నింటిపై చర్చిస్తాం



అన్ని విషయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తాం. నెలకోసారి యువకులమంతా సమావేశం అవుతాం. సభలు, సమావేశాలు, బడి, విద్యార్థులు, ఆర్థిక ఇబ్బందులపై చర్చిస్తాం. – కాత్లె జంగు, యువజన సంఘం అధ్యక్షుడు

'భైరి నరేశ్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలి'



సీఐకి ఫిర్యాదు చేస్తున్న అయ్యప్ప భక్తులు

ఆసిఫాబాద్అర్బన్: అయ్యప్ప జన్మరహస్యంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భైరి నరేశ్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు స్వాములు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్‌స్వామి, గాదెవేణి మల్లేశ్, గురుస్వామి ఖాండ్రె విశాల్ మాట్లాడుతూ నాస్తికత్వం ఉన్నవారు ఇంటికే పరిమితం చేయాలన్నారు. బహిరంగంగా ప్రజాసభల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించేలా మాట్లాడడం సరికాదన్నారు. హిందువుల మనోభావాలు కించపరిచే విధంగా మాట్లాడిన భైరి నరేశ్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ రాణాప్రతాప్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో స్వాములు చంద్రమోహన్, ఖాండ్రె కిషన్, సంతోష్, ప్రతాప్, గణేశ్, అశోక్, శ్రీనివాస్, గుండా ప్రమోద్, గందం వేణు, వినాయక్, తదితరులు పాల్గొన్నారు.

'రేంజర్ల రాజేశ్‌ను అడ్డుకుంటాం'



మాట్లాడుతున్న గడ్డల ప్రణయ్

ఆసిఫాబాద్అర్బన్: హిందూ దేవుళ్లను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన రేంజర్ల రాజేశ్‌ను ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి రాకుండా అడ్డుకుంటామని హిందూ వాహిని జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డల ప్రణయ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో కొందరు భారత రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు అంబేద్కర్ పేరుని అడ్డుపెట్టుకుని విద్వేశాలు రెచ్చగొడుతున్నారన్నారు. అలాంటి వారికి సమాజంలో చోటు ఉండదన్నారు. నాస్తిక సభలు అంటూ హిందూ దేవుళ్లను దూషించడం సరికాదన్నారు. ఇటీవల అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భైరి నరేశ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇకపై ఎవరైనా హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకొనే ప్రసక్తేలేదని హెచ్చరించారు. సమావేశంలో హిందూవాహిని గోరక్షక్ సైదం నాగరాజు, మిట్ట శ్రీశైలం, గడ్డల కిరణ్, సాయి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల అవకతవకలపై విచారణ చేపట్టాలి



సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

తిర్యాణి: వినియోగదారుల నుంచి డబ్బులు తీసుకుని రశీదు ఇవ్వకుండా అవకతవకలకు పాల్పడిన విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు అవినీతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం జేఈ ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్ మాట్లాడుతూ అధికార పార్టీ అండదండలు చూసుకుని పేద ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ సార రమేష్ గౌడ్, మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్, నాయకులు భాస్కర్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన సర్పంచుల రాజీనామా అస్త్రం

- దిగివచ్చిన అధిష్టానం
- ఎలాంటి సమస్యలున్నా తమదృష్టికి తీసుకురావాలని కోరిన ప్రజాప్రతినిధులు
- ఆదివాసీ భవన్ నిర్మాణానికి భూమిపూజ



ఆదివాసీ భవన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు

వాంకిడి(ఆసిఫాబాద్): సంచలనంగా మారిన సర్పంచుల రాజీనామాకు ఫలితం దక్కింది. గ్రామాల్లో అభివృద్ధి జరగడంలేదని డిసెంబర్ 27న మండలంలోని 18 మంది ఆదివాసీ సర్పంచులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పార్టీ ప్రధాన నాయకులు పలుమార్లు సర్పంచులతో రహస్య భేటీలు జరిపి బుజ్జగించే ప్రయత్నాలు చేసినా సర్పంచులు మాత్రం తమ డిమాండ్‌లు పరిష్కరించే వరకు తగ్గేదే లేదన్నట్లుగా వ్యవహరించారు. దీంతో శనివారం జిల్లాలోని ముఖ్యనేతలు మూకుమ్మడిగా మండల కేంద్రానికి చేరుకుని సర్పంచుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన ఆదివాసీ భవన్ నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కోట్నాక కిష్టు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సైతం తక్షణమే పరిష్కరించాలని కోరారు. నేతల హామీల మేరకు బీఆర్ఎస్‌లో కొనసాగనున్నట్లు ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనప్ప మాట్లాడుతూ మనమంతా ఒకే కుటుంబానికి చెందిన వారమని, ఎలాంటి సమస్యలున్నా మనలో మనమే పరిష్కరించుకోవాలని, ఎలాంటి ఆవేశ పూరితమైన నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. రూ.21 లక్షల నిధులతో ఆదివాసీ భవన్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలు త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముండె విమలబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, తహసీల్దార్ రహీముద్దీన్, స్థానిక సర్పంచ్ తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా సతీశ్ బాధ్యతల స్వీకరణ



సతీశ్‌ను సన్మానిస్తున్న పోస్టల్ కార్యాలయ సిబ్బంది

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా సిరికొండ సతీశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం పోస్టల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సతీశ్ ప్రమోషన్‌పై కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ తపాలా కార్యాలయానికి వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ విధులు నిర్వర్తించిన పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అజరుద్దీన్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సతీశ్‌ను తపాలా కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్లు, జీడీఎస్‌లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.









నూతనోత్తేజంతో..

కాల చక్రం గిర్రున తిరిగింది. తీపి, చేదు కలయికగా 2022 చరిత్ర పుటల్లోకి వెళ్లిపోయింది. రేపటి భవితకు నేడు నూతనోత్సాహాన్ని నింపుతూ స్వాగతం పలుకుతోంది 2023. గత అనుభవాలను పాఠంగా చేసుకుని భావి జీవితాన్ని అందంగా మలుచుకోవడానికి తొలిఅడుగులు వేయటానికి ఎర్ర తివాచీ పరుస్తోంది. కొత్త బంగారు లోకం నీదేనోయి అని స్వాగతం పలుకున్న నూతన సంవత్సరం సందర్భంగా లక్ష్యాలపై యువతీ యువకుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...



రైతులు బాగుండాలి



ఆసిఫాబాద్‌అర్బన్: రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందనేది నా అభిప్రాయం. రైతులకు పండించిన గిట్టుబాటు ధరలను ప్రభుత్వాలు కల్పించాలి. ఈ సంవత్సరం వర్షాలు అధికంగా కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వాలు అన్ని రకాలుగా ఆదుకోవాలి. 2023లో రైతులకు మంచి జరగాలి.

– ఆవడపు ప్రణయ్, ఆసిఫాబాద్

తప్పులు గుర్తించి.. ఉద్యోగం సాధించి



మంచిర్యాలఅర్బన్: గతేడాది చేసిన తప్పులను సరిదిద్దుకుని నూతన సంవత్సరంలో లక్ష్యాలను అధిగమించేందుకు కష్టపడుతాను. ఉ ద్యోగం సాధించి నా తల్లిదండ్రుల్లో సంతోషం నింపుతాను. పదో తరగతిలో జీపీఏ సాధించి డిప్లొమా కోర్సు తీసుకుంటాను. ఫ్యాషన్ డిజైనింగ్ చేయటం నా అభిరుచి.

– శివాణి , మంచిర్యాల, విద్యార్థిని

గడిచిన సంవత్సరం తృప్తినిచ్చింది..



ఆసిఫాబాద్‌అర్బన్: గత సంవత్సరం ప్రభుత్వాల కృషితో ప్రజల సహకారంతో వైరస్ ప్రభావం లేకపోవడంతో భవిష్యత్‌లో అనుకున్న లక్ష్యాలన్నీ చేరుకోగలిగాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. ఈ నూతన సంవత్సరంలో సొంత ఊరు ఆసిఫాబాద్ ప్రాంతంలో రాజరాజేశ్వరా సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు సేవలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న.

– మసాదె ప్రసాద్ (చింటు)

నీట్‌లో మంచిమార్కులు సాధిస్తా..



మంచిర్యాలఅర్బన్: గతేడాది కంటే ఈ ఎడాది ఎంతో కీలకం. ఇంటర్మీడియట్ బీపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న. బైపీసీ తర్వాత నీట్ పరీక్ష రాసి అందులో మంచి మార్కులు సాధించాలనకుంటున్న. ఎంతో కష్టమైన సీటు సాధించి తల్లిదండ్రుల్లో సంతోషాన్ని కల్గిస్తాను. రానున్న సంవత్సరం అంతా మంచి జరుగుతుందని ఆశిస్తున్న. – శ్రీజ, బైపీసీ రెండో సంవత్సరం విద్యార్థిని

ఇంకొకరికి సాయం అందిస్తా..



మంచిర్యాలఅర్బన్: కరోనా కారణంగా వెనకబడిన కొన్ని అంశాలను గతేడాది మెరుగుపర్చుకునేందుకు దోహదం పడింది. ఇల్లు, కళాశాలలు కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఉపయోగపడ్డాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. ఎంసెట్ పరీక్ష రాసి మంచి ఫలితాలు సాధించటం ముందున్న లక్ష్యం. ఆర్థిక సమస్యలు అడ్డుపడుతున్న వారికి నా వంతు సాయం చేస్తాను.

– స్వాతి, విద్యార్థిని

సమయపాలన పాటిస్తూ..



మంచిర్యాలఅర్బన్: రెండో సంవత్సరం ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి యూనివర్శిటీలో డిగ్రీ చదువాలనుకుంటున్నాను. బీకాం కంప్యూటర్ తీసుకోవటం.. బ్యాంక్‌లో మేనేజర్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంగా పెట్టుకున్నాను. నాపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు వమ్ముచేయకుండా కొత్త సంవత్సరంలో సమయపాలన పాటిస్తూ ముందుకు సాగుతాను. – అక్షయ.. ఇంటర్ సెకండియర్

పదిలో జీపీఏ లక్ష్యంగా చదువుతా



మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పరీక్షల్లో పది జీపీఏ ఫలితాలు సాధించేందుకు ఇష్టపడి చదువుతాను. గతేడాది చదువులో వెనకబడిపోయి నా తోటి స్నేహితులు.. ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మాటల్లో చెప్పరానిది. ఏకాగ్రతతో చదివి అనుకున్న లక్ష్యాల సాధిస్తాను. క్రమశిక్షణతో నడుచుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకువస్తాను.

– శంశాక్, పదోతరగతి విద్యార్థి

బావిలో దూకి ఆటోడ్రైవర్ ఆత్మహత్య



జనార్దన్ (ఫైల్)

రెబ్బెన: మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఆటో డ్రైవర్ బావిలో దూకి ఆత్మహత్మకు పాల్పడిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై భూమేష్ వివరాల ప్రకారం... మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన పల్లె జనార్దన్(40) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలతో భార్య ఐదేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తండ్రి వద్దే ఉంటున్నాడు. మూడు నెలల క్రితం తండ్రి మృతి చెందడంతో అతిగా మద్యానికి బానిసయ్యాడు. మూడు రోజులుగా ఇంటికి రాకపోవడంతో బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామ సమీపంలోని బావి వద్ద ఆటో ఉండడంతో అనుమానం వచ్చి బావిలో చూడగా మృతదేహం కనిపించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దళితులు రాజ్యాధికారం సాధించాలి

నస్పూర్: దళితులు ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారం సాధించాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. శనివారం ఆయన నాయకులతో కలిసి నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అంబేద్కర్ సందేశ్ యాత్రలో భాగంగా నస్పూర్‌లో పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దళితులకు ఆత్మ గౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధించడమే తమ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు.

































